# నా నిరాహార దీక్ష

నా నిరాహార దీక్ష జయప్రదంగా ముగిసింది కాబట్టి, యీ దీక్షను గురించి సవిస్తరంగా యిప్పుడు పత్రికలో ప్రకటిస్తున్నాను. (ఈ విషయంలో పత్రికలు నాకు అన్యాయం చేసినవి అని చెప్పక తప్పదు. ఒక్క పత్రికకూడ నా నిరాహార దీక్షనుగూర్చి యింతవరకు ప్రకటించనే లేదు.)

అసలు ఉపవాస దీక్ష ప్రారంభించాలి అన్న విషయం 15 రోజుల క్రింద నాకు తట్టింది. ప్రతి భారత పౌరుడు నిరాహార దీక్ష తన జన్మలో ఎప్పుడో ఒకసారి అయినా చెయ్యవలెనన్న సంగతి అందరకూ తెలిసినవిషయమే. ఒకే వ్యక్తి ఎన్ని సార్లు ఉపవాసదీక్షకు ఉపక్రమించితే అంత మంచిదని వేరే చెప్పనక్కరలేదు. ఏ విషయంమీద దీక్ష కొనసాగించడమూ అని మూడురోజులు తీవ్రంగా ఆలోచించాను. ఈ సందర్భంలో ప్రజలకు, యికముందు నిరాహార దీక్ష అవలంబించ తలచిన మహాత్ములకు ఒక చిన్న విషయం చెప్పతలచుకున్నాను. నిరాహారదీక్ష పూనదలచుకొన్న వ్యక్తికి దీక్షే ప్రధానంగాని, సంగతి సందర్భాలు అనవసరం. ఏ చిన్న విషయం మీదనైనా దీక్ష కొనసాగించవచ్చు. లేదా ఏ పెద్దవిషయంపైనైనా కొనసాగించవచ్చు ఇంకొక విషయం. శక్త్యనుసారం దీక్ష వహించవలసినదేగాని శక్తికి మించి దీక్ష కొనసాగించరాదు. దేశంలో ఉన్న దారిద్ర్యం అంతా నశించేదాకానో, అజ్ఞానం అంతా నశించేదాకానో ఉపవాసం సాగిస్తాను అని ఎవ్వడూ దీక్షకు పూనుకోకూడదు. ఫలానిది సాధ్యం అని తెలిసినపుడే దీక్షకు పూనుకొనవలసి ఉంటుంది.

ఈ విధంగా ఆలోచిస్తే నేను ఏ విషయం మీద దీక్ష సాగించడమూ అన్న సంగతి గడ్డు సమస్య అయింది. అందుకని నా మిత్రులని, నా అనుచరులు అని అనుకొనబడే వారిని సలహా అడిగాను.

"బ్లాకుమార్కెటును గూర్చి ఎందుకు చెయ్యకూడదూ" అని అడిగాడు నా ప్రియ మిత్రుడు రామమోహనరావు.

"అది పొరబాటు. దీక్ష పూనినతర్వాత ఆ పని కొనసాగేవరకు, విరమించకూడదు. బ్లాకుమార్కెటు అంతరించింది అని మనకు హామీ యెవరిస్తారు? కాబట్టి, యిటువంటి విషయాలపైన దీక్షకు దిగటం చాల పిచ్చి పని" అన్నాను.

"మరి నిషేధంమీదనో?" అన్నాడు యింకో మిత్రుడు నరసింహామూర్తి.

"స్వామి సీతారాంగారు దానికి ఉపక్రమించటం, ఆయన దీక్ష విరమించటం అందరికి తెలిసినసంగతే కదా! ఇక ఈ విషయం మీద ప్రజలకు అంతగా ఉత్సాహం ఉండదు."

"అది కాదు నేనన్నది. నిషేధం తీసివెయ్యాలన్న విషయంపైన?"

"దాని కప్పుడే గౌతు లచ్చన్నగారు తయారవుతున్నారన్న విషయం పత్రికల్లో అందరూ చదివారు. ఆయన్ని చూచి నేను మొదలుపెట్టాను అనుకుంటారు ప్రజలంతాను."

"సరే! నీరా విషయం మీద ఎందుకు చెయ్యకూడదు?"

**ఆర్. చలపతిరావు**

"చెయ్యవచ్చును. కాని అందులో ఒక చిక్కు ఉన్నది. స్వామీ సీతారాంగారు కాబట్టి ఏ పది, పదిహేను రోజులలో దీక్ష సాగించారు. నాకు యిదే మొదటిసారి. అదిగాక అంతగా అనుభవం లేనివాణ్ణి. ప్రభుత్వంతో కూడిన పని చాల ఆలస్యంగా జరుగుతుంది. ఎన్నాళ్లు పడుతుందో తెలియదు."

"హైడ్రోజను బాంబులను పరీక్షించడం మానివెయ్యాలన్న విషయంపైన యెందుకు చెయ్యరాదు" అన్నాడు మా నారాయణ.

"ఒకవిధంగా ఆలోచిస్తే ఈ విషయాన్ని గూర్చి ఉపవాస దీక్ష రష్యావాళ్లుకాని, చైనావాళ్లుకాని చేస్తే బాగుంటుంది అని నా అభిప్రాయం. ఎందుకంటావా, హైడ్రోజనుబాంబులు మన దేశంమీద పడతై అన్న భయం నాకులేదు. అదికాక యింకో కిటుకుఉన్నది. హైడ్రోజను బాంబునుగూర్చి దీక్ష పూనుతామనుకో, రేపు రష్యా నైట్రొజన్ బాంబు కనిపెడితే, దాన్ని గూర్చికూడ దీక్ష కొనసాగించవలసివస్తుంది. ఒక బాంబునుగురించి దీక్ష పూనినతర్వాత యింకో బాంబునుగురించి దీక్ష పూనకపోవడం అంత మర్యాదగా ఉండదు. అందుకని అన్నిటికన్నా చివరి బాంబు యేదో తెలుసుకొని దానిమీదనే నిరసన వ్రతం ప్రారంభించడం శ్రేయస్కరం"

ఈవిధంగా నాలుగు గంటలు తర్జన భర్జన జరిగిందికాని అసలు విషయం తేలలేదు.

"ఇంకో సంగతికూడ చెప్పతలచుకున్నాను. వారంరోజుల్లో నా పుట్టినరోజు. ఆరోజుకైనా దీక్ష ప్రారంభించాలి" అన్నాను

"మీ మామగారు పెళ్ళిలో అన్ని లాంఛనాలూ సవ్యంగా చదివించారా?" అని అడిగాడు రామమోహనరావు.

"దానికీ, నిరాహార దీక్షకూ సంబంధం యేమిటి?" అన్నాను.

"ఉన్నదితే"

"ఆఁ! ఏం లాంఛనాలు ఇవ్వటంలే! పెళ్ళిలో నేను రేడియో ఇవ్వమన్నాను. ఆయన ఇవ్వనన్నాడు. నాలుగు నెలలపాటు ఆయన గడప నేను తొక్కలేదు. తరువాత ఆసంగతి ఆయనా మరచిపోయినాడు; నేనూ అంతగా పట్టించుకోలేదు."

"అయితే యింకా ఆలోచిస్తావేం! సమస్య పరిష్కారమైపోయింది. జన్మదినోత్సవం నాటికి రేడియో పంపాలి, లేకపోతే నిరాహారదీక్ష ప్రారంభిస్తాను అని కబురు చెయ్యి"

"భేష్! భేష్! అన్నాడు నారాయణ. "నీవు చెప్పినట్లు, యిది సాధ్యమైన పని. రెండుమూడు రోజులకన్నా ఎక్కువ చేయటం అనవసరం. అసలు అల్లుడు యీ విధంగా ఈవిషయంకోసం నిరాహారదీక్ష ప్రారంభించాడు అంటేనే చుట్టాల లోకంలో అలజడి బయలుదేరి, మీ మామగారు తక్షణం రేడియో సెట్టు తెస్తారు."

"పెళ్ళినాడు యివ్వనందుకు తగినశాస్తి చేసినట్టుకూడా ఉంటుంది"

కాబట్టి ఏ విషయంమీద దీక్ష పూనాలి అన్న సంగతిని తేల్చివేశాను.

"సరే! నిరాహార దీక్ష అనగానే సరిపోలేదు. దానికి చాల హంగామా ఉన్నది. అంతా టెలిగ్రాంలమీద జరగవలసిన పని. ఉత్తరాలు లాభంలేదు. కాబట్టి ఈ తక్షణమే మీ మామగారికి యీ విషయం వివరిస్తూ టెలిగ్రాం యివ్వు."

అందరి సలహామీద యీ క్రింది విధంగా టెలిగ్రాం పంపాను.

"ప్రియమైన మామగారికి,

వారం రోజుల్లో నా పుట్టినరోజు పండగ అన్న సంగతి మీకు తెలిసిన విషయమే! ఆరోజుకు నాకు రేడియో సెట్టు మీరు పంపాలి. లేకపోతే నిరాహార దీక్ష బూన తలచుకున్నాను. రెండురోజుల్లో సమాధానం రాకపోతే నిరాహార దీక్ష ప్రస్తుతం నేనున్న వసతిగృహంలోనే ప్రారంభిస్తాను. మీ అల్లుడు"

"సరే! టెలిగ్రాం సంగతికూడ అయిపోయింది. ఇక పోతే డాక్టరు విషయం, రోజుకు కనీసం ఒకసారి అయినా నీ ఆరోగ్య పరిస్థితులనుగూర్చి డాక్టరు ప్రకటించాలి. దీక్ష మూడురోజులపాటు సాగిన తరువాత రోజుకు కనీసం రెండు మూడు సార్లన్నా ప్రకటనలు చెయ్యాలి"

"సరే మన మిత్రుడు నాగభూషణం డాక్టరే కాబట్టి, రోజుకు నేను ఎన్ని పౌనులు తగ్గిందీ, పల్సురేటు ఏవిధంగా ఉన్నదీ ప్రకటిస్తాడు" అన్నాను.

"ఆ విషయంకూడ సబబుగానే ఉన్నది. తరువాత ఈదీక్షసమయంలో నీవేమి పుచ్చుకోవాలి అన్న సంగతి ఆలోచిద్దాం. అన్నం కూరలు తినకూడదన్న విషయం నీకు తెలిసిన విషయమే కదా!"

"అదేమిటి? అసలు నీళ్లయినా ముట్టకూడదు" అన్నాడు నరసింహమూర్తి.

"నన్ను చంపవాకండి! ఇదే మొదటిసారి నాకు! ఇదే చివరిసారికూడ కానివ్వకండి! కొంచెం చూసీ చూడనట్లు పోనీండి" అన్నాను అతిదీనంగా.

"అయితే నీళ్లు త్రాగవచ్చు" అన్నాడు.

"నీళ్లగొడవ కాదు! నేను కాఫీ లేంది అసలు ఉండలేను" అన్నాను.

"కాఫీ అంటే నీళ్లేగా! ఈ రోజుల్లో మనం త్రాగేది నీళ్ల కాఫీయేగా" అని సమర్థించాడు.

"తరువాత యింకా యేమీ తినకూడదా?"

"ఊహూ" అని అందరూ నిష్కర్షగా తల లూపారు.

"అదేమిటి? మన యింట్లో వాళ్లందరూ యేకాదశినాడు ఉపవాసముండి ఉప్పుడు పిండి తినటంలేదా?" అని అడిగాను.

"అవు ననుకో!"—అన్నాడు రామమోహనరావు కొంచెము సంకోచిస్తూ.

"సరే పోనీ! పిండి తిను."

"పిండి కాదులే! ఆధునిక పరిస్థితులను బట్టి పిండిని ఉప్మాగా మారుద్దాం" అన్నాను. అందరూ అంగీకరించారు

"అన్ని విషయాలూ బాగానే ఉన్నవి కాని ఈవార్త పత్రికలలో ప్రకటించాలి. కనీసం ఒక అర డజను విలేఖర్లనన్నా రోజూ యిక్కడికి రప్పించాలి" అన్నాడు.

"అది యెంత పనిలే" అన్నాడు నారాయణ.

రెండు రోజులు గడిచింది. మా మామగారివద్దనుండి సమాధానం రాలేదు. దానికి తోడు ఏ పత్రికలవాళ్ళుకూడ నా ఉపవాసదీక్షను గురించి ప్రకటించనేలేదు. ఎందుకో నా కింతవరకూ అర్థం కాలేదు. పోనీ కరపత్రాలయినా పంచిపెట్టితే ప్రజల సానుభూతి కొంత ఉంటుంది అని మా మిత్రులందరూ సలహా యిచ్చారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రజల సానుభూతి లేనిది యే వ్యవహారం జరగటం అసంభవం. అయిదు వందల కరపత్రాలు నా నిరాహార దీక్ష, దాని ఆశయాలనుగూర్చి వివరించుతూ ప్రకటించాము. మా చుట్టాలకు, మా అందరి మిత్రులకు, మంత్రులకు, వివిధ పార్టీ నాయకులకు పంపాము. కాని ఎవ్వరివద్దనుండీ

(54-వ పేజీ చూడండి)




ఉత్తమ సంఘసేవా కార్యక్రమాల, పారిశ్రామిక సౌకర్యాల నిమిత్తం

వీటిపై పెట్టుబడి పెట్టండి

భారీ భారతదేశాన్ని సుభిక్షమొనర్చటానికి తోడ్పడే గొప్ప అభివృద్ధి ప్రణాళికల నిర్వహణకు ద్రవ్యసహాయం నిమిత్తం భారతదేశంలో సేకరింపబడుతున్న పెట్టుబడులను వృద్ధిచేయటానికి ఎంత స్వల్పమైన మొత్తమైనా అవసరమే.

స్వల్పాదాయములను కూడబెట్టుకునే ప్రజానీకం సంపూర్ణ భద్రతను హామీతో వర్ధిల్లి విరాజిల్లుతున్నది.

ధీవివృద్ధికి కారణం — ఇది ప్రస్ఫుటముగా కనిపిస్తున్న లక్షణాలను తీర్చుతున్నది - ఇది మీ క్షేమానికి మీ దేశక్షేమానికి మహోన్నత విధి దోహదపడునట్లు చేస్తున్నది.

| | |
|---|---|
| నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు | రు. 100 పెట్టుబడికి 12 సంవత్సరాలలో రు. 150/- లభించగలదు. |
| పది సంవత్సరాల ట్రెజరీ సేవింగ్స్ డిపాజిట్లు | సాలీనా 3½% వడ్డీ చెల్లింపు; 10 సంవత్సరాల తరువాత ధనానికి భద్రత. |
| పోస్టు ఆఫీసు సేవింగ్స్ బ్యాంకు డిపాజిట్లు | రు. 10, 000 వరకు డిపాజిట్లపై 2% వడ్డీ చెల్లబడుతుంది. (జాయింట్ అకౌంట్ల విషయంలో రు. 20,000/- వరకు డిపాజిట్లపై) |

లభించే వడ్డీపై భారతీయ ఆదాయపు పన్ను ఉండదు.

భారతదేశ ప్రణాళిక ఒసగుతున్నది

ఎక్కువ పాఠశాలలు - ఎక్కువ ఆసుపత్రులు ఎక్కువ రోడ్లు

ఇంకా ఇతర వివరాలకు, లేక/మరియు ఈ పెట్టుబడుల గురించిన నిబంధనలకై నేషనల్ సేవింగ్స్ కమిషనర్ ... మీ రాష్ట్రంలోని రీజనల్ నేషనల్ సేవింగ్స్ ఆఫీసరుకుగాని వ్రాయండి.

# ★ నా నిరాహార దీక్ష ★

(11-వ పేజీ తరువాయి)

కూడ సమాధానం రాలేదు. కొబట్టి అధైర్య పడకుండా ఓపిక పట్టడం తప్ప చేసే పని యేమీ లేకపోయింది ఈలోపల మా నారాయణ ఒక వార్త తెచ్చాడు.

"మీ మామగారు మొన్న మా నాన్నకు కనపడి, యీ చిన్న విషయంపైన నిరాహారదీక్ష బూనడం అనవసరమని, ఎప్పుడో ఒకప్పుడు తనే రేడియో కొని యివ్వతలచుకున్నాననీ చూచాయగా అన్నాడుట."

"ఆయన సంగతి నీకు తెలీదు. ఈ మాటలువిని మనం మోసపోకూడదు. ఆయన గాని ఆయన తరఫున వచ్చినవారు గాని హామీలిచ్చినా నాకు వాటితో పనిలేదు. ఆ రేడియో సెట్టు నా కళ్ళారా చూస్తేనే కాని దీక్ష విరమించను" అన్నాను.

"సరే! ఆ సంగతే టెలిగ్రాం ద్వారా కబురుచెయ్యి"

ఈవిధంగా రెండో టెలిగ్రాం పంపాను.

"మామగారికి,

నేను నిరాహారదీక్ష పూనుతున్నా నన్న సంగతి తెలిసికూడ, మీకు హృదయ పరివర్తన యేమీ కలగనందుకు చాల విచారిస్తున్నాను. ఈనాడు మధ్యాహ్నం 12 గంటల నుండి(భోజనానంతరం) నా నిరాహారదీక్ష ప్రారంభిస్తున్నాను. ఏ విధమైన హామీలు ఒప్పుకోనబడవు. రేడియో సెట్టు నాకళ్లారా చూస్తేనే తప్ప దీక్ష విరమించ దలచుకోన లేదు.—మీ అల్లుడు."

దీక్ష ప్రారంభించాను. రెండు రోజులు గడిచింది. సమాధానం లేదు. పత్రికలలో ఈవిషయమే లేదు. మా మిత్రులు అందరూ కూడి యీవిధంగా తీర్మానించి, ఆ తీర్మానాన్ని మా మామగారికి తంతిద్వారా అందజేశారు.

"మీ అల్లుడుగారు నిరాహారదీక్ష బూని యిప్పటికి రెండు రోజులయింది. డాక్టరు ప్రకటనప్రకారం $1\frac{1}{2}$ పౌనులు తగ్గారు. చాల బలహీనంగా ఉన్నారు వారి పరిస్థితి చాల ఆందోళనగా ఉన్నది చుట్టాలు గుంపులు గుంపులుగా వచ్చి మీ అల్లుడిగారి విషయమై ఖంగారు పడుతున్నారు. మీరు యీ విషయంపై తగిన చర్య వెంటనే తీసికొని రేడియోసెట్టు మీ అల్లుడిగారికి తెచ్చి దీక్షను విరమింప జేయగలరని ఆశిస్తున్నాము."

ఇంకా రెండు రోజులు సమాధానంలేదు తెల్లవారితే జన్మదినం. రేడియోసెట్టు రాలేదు నీరసంగా, మాట్లాడలేని స్థితిలో ఉన్నాను. చాలమంది మిత్రులు, శ్రేయోభిలాషులు దీక్ష విరమించమని కోరారు కాని నేను అంగీకరించలేదు.

జన్మదినం చాల విచారకరంగా సాగింది. ఆరోజు సాయంత్రం అయిదు గంటలకు మా మామగారు రేడియోసెట్టు తీసికొని వస్తున్నారన్న వార్త చూచాయగా తెలియవచ్చింది. కాని ఆవార్త ధృవపడే వరకు నేనుమాత్రం దీక్షను విరమించ తలచుకోలేదు రాత్రి ఏడున్నర గంటలకు మా మామగారు రేడియో సెట్టుతో సహా వచ్చారు. రేడియో కళ్ళారా చూచిన తరువాత నా నిరాహారదీక్ష విరమించానని తలఊపాను. ఆ మరుక్షణమే భోజనం చేశాను. ఆరాత్రి అల్లా మిత్రులయొక్క, చుట్టాలయొక్క, అభినందనాలతో కాలం గడిచింది. ఈ సందర్భములో నా నిరాహారదీక్ష జయప్రదంగా సాగించినవారికి, నాయందు సానుభూతి చూపినవారికి ఎంతయు కృతజ్ఞత ప్రకటించాను.

ఆ మరునాడు నేను నిరాహారదీక్ష మానిన సంగతి కూడ పత్రికలకు పంపాము దాన్ని కూడ యే పత్రిక ప్రకటించలేదంటే, యీ పత్రికలవారు నాకెంత అన్యాయం చేసిందీ పాఠకులు ఊహించుకోవచ్చు.

ఒక గంటతర్వాత నరసింహమూర్తి పిడుగువంటి వార్త తెచ్చాడు

"అంతా మోసం! మోసం! ఆ రేడియో కొన్నది కాదుట! ఊరికే ఒక పూట ఉంచుకొని తిరిగి పంపిస్తానని మీ మామగారు రేడియోషాపులో తెచ్చాడుట! ఆ రేడియో షాపువాడు మావాడే! వాడు యివ్వాళ రేడియో తిరిగి తీసుకవెళుతాడుట."

అందరం దిగ్భ్రాంతులం అయినాం.

"అయితే దీక్ష విరమించలేదు"అన్నాను కచ్చితంగా.

"ఈ దీక్షల విషయంలో యింకో ధర్మసూత్రం ఉన్నది ఒక విషయంపై దీక్ష పూని మానివేసిన తరువాత ఆ విషయంపైనే తిరిగి దీక్ష పూనకూడదు"

"మరి యిప్పుడెట్లా తలయెత్తుకొని తిరిగేది?"

"నీవు అసలు సంగతి మరచిపోయినావు. నీకు కావలసింది రేడియో కాదు. నిరాహారదీక్ష నెరవేరడం ఆ దృష్ట్యా ఆలోచిస్తే నీ దీక్ష జయప్రదం అన్నాలి కొంచెము అనుభవం సంపాదించావు కాబటి యిక ముందు రాజకీయ రంగంలోకి దిగవచ్చు." ★




సలహాలనిచ్చు వైద్యులు: Dr. ఎస్. శంకున్ని మేనన్ L. I. M.

# కర్నూలులో ఎండమావులు

(8-వ పేజీ తరువాయి)

తనకు తానే ఆ అధికారం కల్పించుకున్నాడని తేలింది అతని తెలివికి మెచ్చి రాజుగారు అతనికి మంత్రిత్వం ఇచ్చారని ప్రతీతి. అదీ కథ. ఆ కథ పేరు 'పిత్తల్ కా దర్వాజా.'

రాజధానిలో వాతావరణం చల్లబడే వరకు దేనినైనా స్పష్టంగా పరిశీలించాలంటే యీ వేడిగాలులు అడ్డు వస్తూనే ఉంటవేమోనని నా సందేహం.

—తూలిక కా భూషణ్.